ప్రజా విశ్వంభర V3 NEWS

తెలంగాణ ఉద్యమంలో వికలాంగుల పాత్ర ఎనలేనిది

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: ఈ సందర్భంగా కాచం సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం లో ఎల్బీనగర్ కు పత్యేక పాత్ర ఉందన్నారు . ఉద్యమ పురిటి గడ్డ ఎల్బీ నగర్ నుండే తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడిందని గుర్తు చేశారు. ఆనాడు ఉద్యమంలో వికలాంగులు, దివ్యాంగులు పెద్ద ఎత్తున పాల్గొని తమ మద్దతు పలికారని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కోసం తాము అందరం కలిసి పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నామని కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పన్నెండేండ్లు అవుతున్నా ఉద్యమ కారుల ఆశయాలు మాత్రం నెరవేరలే దన్నారు . పదేండ్లు అధికారం లో ఉన్న బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులను విస్మరించిందని విమర్శించారు. 2014 లోనే ఉద్యమకా రుల సంక్షేమం కోసం టీజీయుఎస్ఎస్ పేరుతో సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇప్పటికే దాదాపు ఐదు వందల మంది కి పైగా ఉద్యమకారులను గుర్తించి వారికి అండగా ఉంటామని బరోసా కల్పించామని తెలిపారు. ఉద్యమం లో పాల్గొన్న పాల్గొన్న ప్రతి ఒక్క ఉద్యమకారులకు, వికలాంగులకు, దివ్యాంగులకు ఉద్యమ కారుల సంక్షేమ సంఘం రక్షణ గా పని చేస్తుందని ఆయన తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు ఉద్యమకారులను గుర్తించేందుకు కమిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. ఈ కమిటీలో ఉద్యమ నాయకులైన మంత్రి పొన్నం, ఎమ్మెల్సీలు కోదండరాం, అద్దంకి దయాకర్, రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి లను నియమించడం ద్వారా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందన్న విశ్వాసం ఉందన్నారు. అలాగే ఈ కమిటీ 1969 ఉద్యమం లో పాల్గొన్న ఉద్యమకారులతో పాటు 2001 నుండి 2014 వరకు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారందరికీ న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కమిటీ కాలయాపన లేకుండా అందరి సలహాలు సూచనలు తీసుకొని , తమ కార్యాచరణను విధి విధానాలను రూపొందించి అందరికీ న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు. ఉద్యమం లో పాల్గొన్న వారి త్యాగాలు అందరికీ తెలుసని వారి త్యాగాలను గుర్తించేందుకు ప్రభుత్వం 250 గజాల ఇంటి స్థలం తో పాటు వారికి బస్ పాస్ సౌకర్యం మరియు గుర్తింపు కార్డులు ఇవ్వాలని అన్నారు.హైదరాబాద్ లోని ఉద్యమకారులకు ఫ్యూచర్ సిటీలో ఒక వెయ్యి ఎకరాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ మోతె శోభన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అమరులైన కుటుంబాలతో పాటు, ఉద్యమం లో పాల్గొన్న ప్రతి ఒక్క ఉద్యమకారుడికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీ ఉద్యమకారులకు అన్యాయం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఉద్యమకారులను గుర్తించేందుకు కమిటీ వేసిందని ఇప్పటికే తెలంగాణ లోని అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అమర జ్యోతి లో ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఆఫీస్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. త్వరలోనే అన్ని జేఏసీలు, ఉద్యోగ సంఘాలు, విద్యార్థి సంఘాలు, వికలాంగులతో సమావేశం ఏర్పాటు చేసి వారి సూచనలు సలహాలను తీసుకొని, అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యమం లో పాల్గొన్న వికలాంగులకు దివ్యాంగులకు ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ కాచం సత్యనారాయణ చేతుల మీదుగా వారికి గుర్తింపు కార్డు లను అందజేశారు. ఈ సందర్భముగా వికలాంగులు మాట్లాడుతూ ఎల్బీనగర్ ఉద్యమం లో మేము భాగస్వామ్యం అని చెప్పుకోవడానికి గర్వంగా ఫీల్ అవుతున్నామని తెలిపారు. తెలంగాణ సాధనలో భాగస్వాములు అయిన ప్రతి ఒక్క వికలాంగులకు న్యాయం చేయాలని కోరారు. తమను గుర్తించి మాకు అండగా ఉన్న అని బరోసా కల్పించిన కాచం సత్యనారాయణ కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల సంక్షేమ సంఘం నాయకులు కేవీ రంగారెడ్డి, పల్లె వినయ్ కుమార్ గౌడ్, బీరెల్లి వెంకట్ రెడ్డి, కొత్త రవి,కూర రమేష్, శ్రవణ్ గుప్తా, పురందర్, శ్రీధర్, మరియు పలు నియోజక వర్గాల నుండి వికలాంగులు , దివ్యాంగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం



విశ్వంభర, ఏపీ బ్యూరో: మృతులు అప్పారావు, ప్రభాకర్‌రావు, కృష్ణ, రమణ, త్రినాథ్, గోల్డ్ కుమార్, అప్పలరాజు, భానుకుమార్, రామనాథ్‌గా అధికారులు గుర్తించారు. వీరిలో ఆరుగురు ఉద్యోగులు కాగా ముగ్గురు ఒప్పంద కార్మికులని తెలిపారు. గాయపడిన రావూరి మల్లికార్జునరావు, పల్లెల శ్రీనివాస్, అర్జున అప్పారావు, సత్యనంద్, సూరిబాబు, పైడిరాజులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.ఘటనా స్థలాన్ని హోంమంత్రి అనిత, విశాఖ ఎంపీ భరత్ పరిశీలించారు. ప్రమాదం ఏ విధంగా జరిగిందో ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలు, భద్రతా చర్యలు, బాధిత ఉద్యోగులకు అందిస్తున్న వైద్య సేవలపై వారు ఆరా తీశారు. గాయపడిన ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను అనిత ఆదేశించారు.

మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ సంతాపం..

విశాఖ స్టీల్‌ప్లాంట్ దుర్ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు మోదీ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధాన మంత్రి కార్యాలయం ట్వీట్ చేసింది. పీఎం రిలీఫ్ ఫండ్ కింద మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ. 50వేలు అందిస్తున్నట్లుగా ఆయన ప్రకటించారు.

సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంపై ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై అధికారులతో మాట్లాడారు. పలువురు కార్మికులు చనిపోవడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని, అన్ని శాఖలు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితి, సహాయక చర్యలను స్టీల్ ప్లాంట్ అధికారులు చంద్రబాబుకు వివరించారు.

ఘటనాస్థలిని పరిశీలించిన కుమారస్వామి

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఘోర ప్రమాదంపై కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖమంత్రి హెచ్‌డీ కుమారస్వామి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఘటనాస్థలిని మరో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. ఈ ప్రమాదానికి దారి తీసిన పరిస్థితులను అధికారులు పరిశీలిస్తున్నారని.. బాధితులకు అన్ని రకాలుగా సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. కార్మికుల భద్రత, శ్రేయస్సే తమకు అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలి: కిషన్ రెడ్డి

విశాఖ స్టీల్ ప్లాంట్ దుర్ఘటనపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపిన ఆయన.. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించాలని కోరారు. మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరారు.

స్టీల్ ప్లాంట్ లో ప్రమాదంపై కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆరా తీశారు. ఈ ఘటన జరగడం చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. లాడిల్‌లో ఉక్కుద్రవం తరలిస్తుండగా పేలుడు జరిగిందని తెలుస్తుందని చెప్పారు. ప్రమాదం ఎలా జరిగిందో ఇప్పుడే స్పష్టంగా చెప్పలేమన్నారు. ఘటనాస్థలానికి వెళ్లి సహాయ చర్యలు పర్యవేక్షిస్తానని వివరించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో కార్మికులు మృతిచెందడం తీరని విషాదమని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం క్షతగాత్రులకు వైద్యం, ప్రమాద స్థలంలో సహాయకచర్యలను పర్యవేక్షిస్తోందని ఎక్స్ వేదికగా లోకేశ్ ట్వీట్ చేశారు.

పింఛను కోసం హత్య..

భార్యకు జీవిత ఖైదు..
ఇద్దరు పిల్లలకు మరణశిక్ష
మాల్కాజిగిరి జిల్లా కోర్టు సంచలన తీర్పు



విశ్వంభర, కాప్రా: పింఛను డబ్బు కోసం వ్యక్తిని దారుణంగా హత్య చేసిన కేసులో న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. మృతుడి భార్యకు జీవిత ఖైదు, కుమారుడు, కుమార్తెకు మరణ శిక్ష విధిస్తూ మాల్కాజిగిరి జిల్లా కోర్టు తీర్పు ఇచ్చింది. వివరాల్లోకి వెళితే.. 2019 ఆగస్టులో విశ్రాంత రైల్వే ఉద్యోగి మారుతి సుతార్(70)ను పింఛను డబ్బు కోసం అతని భార్య, కుమారుడు, కుమార్తె కలిసి హత్య చేసి ముక్కలుగా నరికారు. అనంతరం ఆ శరీర భాగాలను ఆరు బకెట్లలో నిల్వచేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. సుదీర్ఘ వాదనల అనంతరం సోమవారం న్యాయస్థానం తీర్పు వెలువరించింది. మృతుడి భార్య గంగాబాయికి జీవిత ఖైదు, కుమారుడు, కుమార్తెకు ఉరి శిక్షను విధిస్తూ మల్కాజిగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాస్కర్‌రావు తీర్పు ఇచ్చారు.

డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్‌ను సస్పెండ్ చేసిన ప్రభుత్వం

విశ్వంభర, హైదరాబాద్: బీఆర్ఎస్ హయాంలో చట్టాన్ని కాపాడాల్సిన అధికారులు.. కంచే చేను మేసినట్లుగా ప్రభుత్వ భూములను కొల్లగొట్టారని ఆరోపించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం హౌసింగ్ బోర్డు, ప్రభుత్వ స్థలాలు పరిశీలిస్తుండగా.. రాము నాయక్ భూలీలలు బయటకు వచ్చాయని మంత్రి తెలిపారు. బహిరంగ మార్కెట్లో గజం సుమారు రూ.2లక్షల ధర ఉన్న హైకోర్టు గేట్ల వద్ద హౌసింగ్ బోర్డుకు చెందిన 33.53 చదరపు గజాల స్థలాన్ని రాము నాయక్ 2018 ఫిబ్రవరి 17న అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు బయటపడిందని మంత్రి తెలిపారు. హౌసింగ్ బోర్డులో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి సస్పెండ్ అయిన ఇష్తాకర్ అహ్మద్ భార్య పేరిట ఈ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని.. ఆ తర్వాత 2025లో ఆ భూమి మరొకరి పేరిట మారినట్లు విచారణలో తేలిందని పొంగులేటి తెలిపారు. భూమికి సంబంధించిన పత్రాలను పరిశీలించకుండా రిజిస్ట్రేషన్ చేసిన అప్పటి చార్మినార్ సబ్ రిజిస్ట్రార్‌పై కూడా విచారణకు ఆదేశించామని మంత్రి పొంగులేటి తెలిపారు. రాము నాయిక్ భూదందాలపై 2017 నుంచే పలు కేసులు ఉన్నప్పటికీ.. బీఆర్ఎస్ పాలకులు స్పందించలేదని మంత్రి చెప్పారు. విజయనగర్ కాలనీలో 400 చదరపు గజాలు, తుల్జాగూడలో 22 గజాలు, లక్ష్మిగూడలో 130 గజాలు, మహబూబ్ గంజ్‌లో 497 గజాల స్థలాలను రాము నాయక్ పలువురి పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని.. వాటన్నింటిపై విచారణ జరుపుతున్నామని మంత్రి వెల్లడించారు. ఈ కేసుల్లో సబ్ రిజిస్ట్రార్‌ల పాత్రపై విచారణ జరపాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల ఐజీని ఆదేశించామన్నారు. రాము నాయక్‌పై విచారణ పూర్తి చేసి అన్ని ఆధారాలను నిర్ధారించిన తర్వాత శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగిస్తామని తెలిపారు. రాము నాయక్ భూఅక్రమాలకు సహకరించిన సూపరింటెండెంట్ వివేకానంద్‌ను శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించామని.. మరో సూపరింటెండెంట్ బోనా నాయక్‌ను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించినా.. ఆక్రమణలకు సహకరించినా ఉపేక్షించేది లేదని, ఏ హోదాలో ఉన్నప్పటికీ నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు అక్రమాలకు పాల్పడితే మరింత కఠినంగా వ్యవహరిస్తామని.. క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు కూడా తీసుకుంటామన్నారు.

చేప మందు పంపిణీ ప్రారంభం

మొదటి ప్రసాదాన్ని స్వీకరించిన వీహెచ్, కలెక్టర్
ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం
సుమారు వెయ్యి మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేశాం
అత్యవసర వైద్య సేవల కోసం మెడికల్ టీంలతో పాటు ఐదు అంబులెన్స్‌లను ఏర్పాటు చేశాం
నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్

విశ్వంభర, హైదరాబాద్: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో చేపమందు పంపిణీ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. మొదటి చేప ప్రసాదాన్ని బత్తిని అమరనాథ్ చేతులమీదుగా బీసీ సంక్షేమశాఖ సలహాదారు, మాజీ ఎంపీ వీ హనుమంతరావు, కలెక్టర్ మెట్టు సాయికుమార్ కు వేశారు. చేపమందు తీసుకోవడానికి వచ్చిన వారికోసం స్వచ్ఛంద సేవా నిర్వాహకులు బోజనం మంచినీటి సౌకర్యం కల్పించారు. చేప ప్రసాద పంపిణీ ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ట చర్యలు తీసుకున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగే చేప ప్రసాదం వితరణ కార్యక్రమానికి సంబంధించిన భద్రతా ఏర్పాట్లను ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన క్యూలైన్లు, కౌంటర్లు, మినీ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరును ఆయన నిశితంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.చేప మందు పంపిణీ కోసం బత్తిన కుటుంబ సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశాయన్నారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి ఇప్పటికే దాదాపు 25 వేల మందికి పైగా ప్రజలు ఈ ప్రసాదం కోసం వచ్చారని, పంపిణీ ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు వీలుగా సుమారు వెయ్యి మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేశారని చెప్పారు. ఎలాంటి దొంగతనాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా క్రైమ్ పార్టీలతో పాటు షీ టీమ్స్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కూడా విధుల్లో ఉంటారని, వేర్వేరు రాష్ట్రాల నుంచి వచ్చిన వారి సౌకర్యార్థం పోలీస్ కమాండ్ కంట్రోల్ రూం ద్వారా తెలుగుతో పాటు ఒరియా, కన్నడ, మరాఠీ, గుజరాతీ వంటి వివిధ భాషల్లో అనౌన్స్‌మెంట్స్ చేయడం జరుగుతుందని సీపీ వెల్లడించారు. రద్దీ వల్ల స్థానిక ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన మార్పులు చేశామని, అత్యవసర వైద్య సేవల కోసం ప్రత్యేకంగా మెడికల్ టీంలతో పాటు ఐదు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచడం జరిగిందని, పంపిణీ వద్ద ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని, స్థానికంగా ఉండే ప్రజలు రద్దీని దృష్టిలో ఉంచుకుని మంగళవారం రావాలని కోరారు. తగినంత మొత్తంలో చేప ప్రసాదం అందుబాటులో ఉన్నందున ప్రసాదం దొరుకుతుందో లేదోనని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎలాంటి అపోహలు, పుకార్లను నమ్మవద్దని సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. ప్రజలందరూ ప్రశాంతంగా ఉంటూ చేపప్రసాద పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వానికి, పోలీసులకు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సీపీ లా అండ్ ఆర్డర్ తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీ ట్రాఫిక్ డి.జోయల్ డేవిస్, డీసీపీలు ఆర్.వెంకటేశ్వర్లు, చంద్ర మోహన్, కాజల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్యపై రాజీ లేదు

విశ్వంభర, హైదరాబాద్ : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు రాష్ట్రంలోని పేద, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే జ్ఞాన కేంద్రాలని, విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్య, పోషకాహార విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.జూన్ విద్యా సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు.సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలోని ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, జోనల్ అధికారులు, ప్రధాన కార్యాలయ సిబ్బందితో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ గురుకులాలు నేడు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధిస్తూ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయని అన్నారు. ఈ స్థాయికి తీసుకురావడంలో ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. సాధించిన విజయాలతో సంతృప్తి చెందకుండా మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలని సూచించారు.విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల పెంపు, క్రమశిక్షణ, భద్రత అంశాలను అత్యంత ప్రాధాన్యంతో చూడాలని ఆదేశించారు.

ఫుడ్ పాయిజన్ ఘటనలకు అవకాశం..

ఇటీవలి కాలంలో కొన్ని విద్యాసంస్థల్లో చోటుచేసుకున్న ఆహార సంబంధిత ఘటనలను ప్రస్తావించిన మంత్రి, గురుకులాల్లో అలాంటి పరిస్థితులు తలెత్తకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల కొనుగోలు నుంచి వంట ప్రక్రియ, నిల్వ, పంపిణీ వరకు ప్రతి దశలో నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు.వంటశాలలు, స్టోర్‌రూమ్‌లు, డైనింగ్ హాల్స్‌ను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీటి నాణ్యతను తరచూ పరీక్షించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యం పట్ల సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పారు.

ప్రతి పీరియడ్‌కు ప్రణాళికాబద్ధమైన బోధన

అకాడమిక్ పరంగా ఈ విద్యా సంవత్సరాన్ని మరింత ఫలవంతంగా మార్చేందుకు ప్రతి పాఠశాల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు.పీరియడ్ వారీగా పాఠ్యాంశాల బోధన, వారాంత సమీక్షలు, నెలవారీ విద్యా ప్రగతి నివేదికలు తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని నిరంతరం అంచనా వేస్తూ ప్రత్యేక శ్రద్ధ అవసరమైన వారికి అదనపు అకాడమిక్ సపోర్ట్ అందించాలని చెప్పారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, జేఈఈ, నీట్, క్లాట్, సీయూఈటీ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

అడ్మిషన్లలో పూర్తి పారదర్శకత..

ప్రవేశాల ప్రక్రియలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన ప్రతి విద్యార్థికి అవకాశం కల్పించాలని, అడ్మిషన్ల విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం లేదా అవకతవకలకు అవకాశం ఇవ్వొద్దని హెచ్చరించారు.

విద్యార్థులే గురుకులాల కేంద్రబిందువు..

ప్రతి విద్యార్థిని తమ సొంత పిల్లలుగా భావించి చూసుకోవాలని మంత్రి సూచించారు. వారి విద్యా ప్రగతి మాత్రమే కాకుండా ఆరోగ్యం, మానసిక స్థితి, వ్యక్తిత్వ వికాసం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. గురుకులాలు కేవలం పరీక్షల్లో మార్కులు సాధించే కేంద్రాలు కాకుండా, సమాజానికి బాధ్యతగల పౌరులను తయారు చేసే సంస్థలుగా నిలవాలని పేర్కొన్నారు.ఉపాధ్యాయులు, సిబ్బంది ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి తెలిపారు.సిబ్బంది సంక్షేమం, సేవా సంబంధిత అంశాలు, పరిపాలనా సమస్యలపై సంస్థ యాజమాన్యంతో ప్రత్యేకంగా చర్చించి సాధ్యమైనంత వరకు పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ గురుకులాలను దేశంలోనే అత్యుత్తమ రెసిడెన్షియల్ విద్యా వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి (ఎఫ్ఏసీ) కంభంపాటి శారద, డిప్యూటీ సెక్రటరీ డి. శ్రీనివాసులు, అసిస్టెంట్ సెక్రటరీ (అకౌంట్స్) చిన్న సాయిలు, ఓఎస్‌డీ వై.జే. విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: మంత్రి పదవిలో ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన తన శాఖల ప్రగతి నివేదికను వెల్లడిస్తూ, గిగ్ వర్కర్ల భద్రత నుండి సాండ్ మాఫియా అణిచివేత వరకు ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నాయకత్వంలో గత ఏడాది కాలంగా ప్రజా సంక్షేమం, పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేసిందని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, తెలంగాణ అభివృద్ధిని మరింత వేగవంతం చేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు.గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, వారికి సామాజిక భద్రత, బీమా, ఆరోగ్య రక్షణ కల్పించేలా ప్రత్యేక విధానాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని కార్మికులందరికీ కనీస వేతనాలు తప్పనిసరిగా అందేలా చర్యలు చేపట్టామని, కార్మిక హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఇసుక అక్రమ రవాణా, సాండ్ మాఫియా కార్యకలాపాలపై ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని స్పష్టం చేసిన మంత్రి, అక్రమ తవ్వకాలు మరియు రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలతో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి అనుకూల వాతావరణాన్ని సృష్టించామని, కొత్త పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందిస్తున్నామని చెప్పారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందని, లబ్ధిదారులపై ఆర్థిక భారం తగ్గించేందుకు ఉచిత ఇసుక సరఫరా చేస్తున్నామని వెల్లడించారు. సాండ్ మాఫియా కారణంగా పేదల ఇళ్ల నిర్మాణం ఆగిపోకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఇసుక సరఫరాలో పారదర్శకతను తీసుకువచ్చి ప్రతి అర్హులైన లబ్ధిదారునికి అందేలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.చెన్నూర్ యువతకు నాణ్యమైన నైపుణ్య శిక్షణ అందించాలనే ఉద్దేశంతో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ను ప్రారంభిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కేంద్రంలో నిరుద్యోగ యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందించబడుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఏటీసీ కేంద్రాలు యువతకు ఉద్యోగ అవకాశాల గేట్వేలుగా మారనున్నాయని చెప్పారు.గత ఏడాది ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేసిందని, రాబోయే రోజుల్లో మరింత వేగంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

మహా నగరంలో పేదలకు లక్ష ఇళ్లు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: దేశంలోని అన్నీ ప్రధాన నగరాల్లో కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయన్న ఆయన హైదరాబాద్ మాత్రం నివాసానికి అనుకూల నగరమని కొనియాడారు. పెద్ద నగరాల్లో ఉన్న సమస్యలు ఇక్కడ లేకుండా చేసేందుకు నిపుణులతో కమిటీ వేశామని, పాలనా సమన్వయం కోసమే 3 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సైబరాబాద్ కార్పొరేషన్‌లో ఐటీ కంపెనీలు ఉన్నాయని, దేశ ఐటీ ఎగుమతుల్లో 16.77 శాతం హైదరాబాద్ నుంచే సేవలందిస్తున్నాయని పేర్కొన్నారు. అంతకు ముందు రూ.1674.74 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ముందుగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ భవనం, మియాపూర్‌లో ద్విముఖ పైవంతెన, 2 అండర్‌పాస్‌లు, మియాపూర్ నుంచి ఆల్విన్ ఎక్స్ రోడ్ వరకు ఆరు వరుసల ద్విముఖ పైవంతెన, శేరిలింగంపల్లి రైల్వేస్టేషన్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మియాపూర్ లక్ష్మీనగర్‌లో బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు 6 నెలల ముందు రాజకీయం మాట్లాడుకుందామని, ఈ రెండేళ్లు అందరం కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ నుంచి 8 మంది ఎంపీలను పంపిస్తేనే మోదీ ప్రధానమంత్రి అయ్యారని అన్నారు. 8 మంది బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి ఏం తీసుకొచ్చారని ప్రశ్నించారు. బీజేపీ ఎంపీలు గుజరాత్‌కు గులాంలా ఎందుకు పనిచేస్తున్నారని ఆయన నిలదీశారు. ఇక్కడ ఉన్న ప్రజలు మీకు ఓట్లు వేయలేదా? అని ప్రశ్నించారు. రెండేళ్లలో ఏం చేయలేదని తనను అడుగుతున్నారని ముందు మీరేం చేశారో చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణకు నీటి పారుదల ప్రాజెక్టు నిధులు రాకుండా అడ్డుపుల్ల పెట్టారని ధ్వజమెత్తారు. సబర్మతి, గంగా, యమున ప్రక్షాళన చేస్తే ఆహా ఓహో అంటున్న వీళ్లు మూసి ప్రక్షాళనకు సహకరించమని బీజేపీ ఎంపీలు అడగాలి కదా అని చెప్పారు. తాను ఢిల్లీకి వెళ్లిన 3 రోజుల తర్వాత కిషన్‌రెడ్డి వెళ్లి అన్ని పనులకు అడ్డుతగులుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఢిల్లీకి ఇద్దరం కలిసి వెళదాం అంటే కిషన్‌రెడ్డి రావట్లేదన్నారు. తాను మోదీని కలిసిన 3 రోజుల తర్వాత కిషన్‌రెడ్డి కలుస్తున్నారని, తాను ఏ కేంద్రమంత్రిని కలిస్తే 3 రోజుల తర్వాత కిషన్‌రెడ్డి వెళ్లి కలుస్తున్నట్లు చెప్పారు. తాను వెళ్లి ప్రాజెక్టుల కోసం ప్రధానిని, కేంద్రమంత్రులను ఒప్పిస్తే, నిధులు, ప్రాజెక్టులు ఇస్తే కాంగ్రెస్‌కు, రేవంత్‌రెడ్డి పేరు వస్తుందని కిషన్‌రెడ్డి కర్ర అడ్డం పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.పదేళ్లు సీఎంగా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు ఫామ్‌హౌస్‌లో పడుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి పరోక్షంగా కేసీఆర్‌పై వ్యంగ్యాస్త్రాలు విసిరారు. 12 ఏళ్లుగా ప్రధాని మోదీ ఏం చేశారో రెండేళ్లు సీఎంగా తాను ఏం చేశానో చర్చకు సిద్ధమన్నారు. గాజులరామారంలో వంద ఎకరాల్లో అంతర్జాతీయ బస్ టెర్మినల్‌ను నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. విశ్వనగరంలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరంలో లక్ష ఇళ్లు కట్టించి ప్రజలకు కేటాయిస్తామని, ఏ ప్రాంతం వారికి అక్కడే ఇల్లు కట్టించి ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కబ్జా చేసిన ప్రభుత్వ భూములు గుర్తించి స్వాధీనం చేసుకుంటున్నట్లు తెలిపారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ఇప్పటి వరకు రూ.10 వేల కోట్లు చెల్లించామన్న ఆయన మహిళా సంఘాలకు వెయ్యి బస్సులు కొనిచ్చినట్లు తెలిపారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ మహాలక్ష్మి పథకం వల్లే లాభాల్లోకి వచ్చిందన్నారు.

కలహాలొద్దు.. కలిసి సాగుదాం

విశ్వంభర, నేషనల్ బ్యూరో: ఢిల్లీలో విపక్ష ఇండియా కూటమి నేతలు సమావేశమై ఏకగ్రీవంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అంతర్గత కలహాలను పక్కన పెట్టి బీజేపీ వ్యతిరేకంగా, ప్రజా సమస్యలపై కలిసి పనిచేయాలని నిర్ణయించారు. మిత్రపక్షాలు ఒకరినొకరు విమర్శించుకోకుండా, ఐక్యంగా ముందుకు సాగాలని నిర్ణయించారు.

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే..

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, సీబీఎస్ఈ వ్యవహారం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేయాలని నేతలంతా ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓట్ల దోపిడీ అంశంపై సీజేఐకి లేఖ రాయాలని కూడా ఈ భేటీలో చర్చించి నిర్ణయించారు. నిరుద్యోగం, ధరల పెరుగుదలతో పాటు ప్రజా సమస్యలతో పాటు దేశంలోని అనిశ్చిత ఆర్థిక పరిస్థితులపైనా చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్నారు.

తదుపరి భేటీ హైదరాబాద్‌లో..

రాబోయే వర్షాకాల సమావేశాల నేపథ్యంలో పార్లమెంటులో విపక్షాలన్నీ ఏకతాటిపై ఉండాలని, ప్రజాసమస్యలపై కలిసి పోరాడాలని నేతలు నిర్ణయించారు. అలాగే, ప్రతి రెండు నెలలకోసారి సమావేశమై విపక్షాల ఐక్యతను చాటాలని నిర్ణయించిన నేతలు.. ఇండియా కూటమి తదుపరి సమావేశాన్ని ఆగస్టులో హైదరాబాద్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో 22 విపక్ష పార్టీల నేతలతో పాటు స్వతంత్ర ఎంపీ కపిల్ సిబల్ పాల్గొన్నారు. తొలుత 25 పార్టీలు ఈ సమావేశానికి హాజరవుతాయని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పినప్పటికీ.. డీఎంకే హాజరు కాలేదు. ఆప్ సైతం ఈ కూటమికి దూరంగా ఉంటామని ఇప్పటికే ప్రకటించింది. టీవీకే హాజరయ్యే అవకాశం ఉందంటూ ప్రచారం జరిగినప్పటికీ.. ఆ పార్టీ కూడా ఈ సమావేశానికి హాజరు కాలేదు.

సీఎం రేవంత్ అబద్ధాలు చెబుతున్నారు

మహారాష్ట్ర సీఎంను అసలు సమయం అడిగారా?
రేవంత్‌రెడ్డి ఎలాంటి అపాయింట్‌మెంట్ కోరలేదని దేవేంద్ర ఫడణవీస్ ఆఫీసు చెప్పింది.. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు



విశ్వంభర, హైదరాబాద్: రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి మరిచిపోయి అబద్ధాలు చెబుతున్నారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సీఎం రేవంత్‌రెడ్డి అసలు సమయం అడిగారా? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఎలాంటి అపాయింట్‌మెంట్ కోరలేదని దేవేంద్ర ఫడణవీస్ ఆఫీసు చెప్పిందన్నారు.''నెల క్రితం మంత్రి ఉత్తమ్ కలుస్తామని టైం కోరారు. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి టైం అడగకుండానే కలవకుండా చేస్తున్నారని అబద్ధాలు చెబుతున్నారు. భారత్ పురోగమిస్తోందని ప్రపంచ దేశాలు అంటుంటే కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతుంది. అందుకే, ఉత్తర, దక్షిణ భారతదేశం అంటూ విభజన రాజకీయాలు చేస్తున్నారు. ప్రపంచాన్ని నాశనం చేసిన హిట్లర్ స్ఫూర్తితో హైడ్రా తీసుకొచ్చారట. హిట్లర్ మనస్తత్వమే కాంగ్రెస్ తత్వం. కాళేశ్వరాన్ని కేసీఆర్ ఏటీఎంగా మార్చుకుంటే పాలమూరు ప్రాజెక్టు, మూసీ ప్రాజెక్టును రేవంత్ ఏటీఎంగా మార్చుకోవాలని చూస్తున్నారు. మూసీ ప్రక్షాళన జరగాల్సిందే.. కానీ, నిర్వాసితులను ఆదుకోవాలి'' అని రామ్‌చందర్‌రావు అన్నారు.